

## కుక్కపిల్లను తిన్న ఘనులు....

ముద్దుగా, బొద్దుగా ఉండే కుక్క పిల్లల్ని చూస్తే మనస్సు సంతోషంతో గంతులు వేస్తుంది. దగ్గరకు తీసి ముద్దు చేయాలని ఆరాటపడతాం. అంతటితో ఆగకుండా వాటిని తెచ్చుకొని పెంచుకోవాలని కూడా ముచ్చట పడతాం. కానీ వాటిని కోసుకుని తినాలని మాత్రం ఎవరికీ అనిపించదు. బహుశా అలా ఎవరికైనా అనిపిస్తే వారిని ఏమని పిలవాలి? రాక్షసులనా? నోరులేని మూగ జీవాలని కూడా చూడకుండా ఎనిమిది నెలల కుక్కపిల్లను దొంగిలించి, దాన్ని చంపి తిని, జైలుకెళ్లి, చివరకి పెద్దమనసుతో తమకు క్షమాభిక్ష ప్రసాదించమని జడ్జిని వేడుకున్న రాక్షసుల ఉదంతం ఇది.

హవాయి దీవిలో నివసిస్తోన్న సాటర్నియో ప్లేటింగ్(48), నెల్సన్ డొమింగో(49) అనే ఇద్దరు వ్యక్తులు కాడ్డి అనే ఎనిమిది నెలల కుక్కపిల్లను సుమారు రెండు సంవత్సరాల కిందట దొంగిలించారు. ఆ తరువాత దాన్ని చంపి తిన్నారు. తమ పెంపుడు కుక్క కనపడడం లేదని కాడ్డి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. వీరి దర్యాప్తులో పై ఇద్దరూ ఆ కుక్కపిల్లను దొంగిలించడమే కాకుండా, దాన్ని చంపి తిన్నట్లు తేలింది. కోర్టు విచారణ అనంతరం వీరి నేరం రుజువయి కటకటాలపాలయ్యారు. తాము చేసింది నేరమే అయినా తమకు క్షమాభిక్ష ప్రసాదించాలని వారు కోర్టుకు విన్నవించుకున్నారు. హవాయి దీవిలో అమలులో ఉన్న 'జంతువధ' నేరం కింద నిందితులిద్దరికీ ఐదు సంవత్సరాల కఠినకారాగా శిక్ష పడింది. శిక్ష అనుభవిస్తున్న వారిద్దరూ తమకు క్షమాభిక్ష పెట్టాలని జడ్జిగారికి ఓ అభ్యర్థన పంపుకున్నారు. కుక్కపిల్ల అని కూడా చూడకుండా క్రూరాతిక్రూరంగా చంపి దాన్ని తిన్న ఆ హంతకులకు కఠిన కారాగార శిక్ష విధించాలని పలువురు జడ్జిని కోరారు.

*

'సరసి' కత

వైశంపాయనుడు భార్య సుబ్బాయమ్మ గారితో కలిసి కమ్యూనిటీ హాలుకు బయలుదేరాడు. దార్లో ఏదోమాటల్లో – ఏ విషయమైనా అది నిజం అయితేనే నమ్ముతామనీ, నిజం కాని వాటిని ఎవరూ నమ్మరనీ అన్నాడు వైశంపాయనుడు. నిజం వేరు, నమ్మకం వేరూ అంది సుబ్బాయమ్మ. వైశంపాయనుడు అంగీకరించ లేదు. ఇంతలో హాలులోకి చేరుకున్నారిద్దరూ.

కాలనీ ప్రెసిడెంటు చనిపోతే సంతాప సభ పెట్టారక్కడ. బతికున్నన్నాళ్లూ నిధులన్నీ తినేశాడని, అతడి మీద తనకు గౌరవం లేదనీ, రాననీ సుబ్బాయమ్మ గారు



## నిజమూ నమ్మకమూ

ఎంతచెప్పినా వినకుండా ఆమెను కూడా తీసుకొచ్చాడు వైశంపాయనుడు.

చీకటి పడేదాకా సభ జరిగింది. చివర్లో, చనిపోయిన వ్యక్తికి శ్రద్ధాంజలి ఘటిస్తూ అందరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆ సమయంలో ఎవరో 'కంయ్'మని ఈల వేసి, సైలెంటై పోయారు. ఎవరు వేశారో ఆ చీకట్లో తెలియలేదెవరికీ. అయితే అందరూ వైశంపాయనుడి కేసి అనుమానంగా చూశారు. అతగాడు 'రామ రామ' అంటూ నసిగి, చెంపలేసుకున్నాడు.

"మీ తెలివి తక్కువతనం వల్లా, మీకున్న రెప్యుటేషను వల్లా అటువంటి పాడు పనులు మీరే చేస్తారని అందరికీ నమ్మకం. అది నమ్మకమే కాని నిజం కాదు కదా! నిజానికి ఈల వేసింది నేను! నేనని చెప్పినా ఎవరూ నమ్మరు!'' అంది సుబ్బాయమ్మ గారు తాపీగా – తిరుగు ప్రయాణంలో.

*